క్లుప్తంగా

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

రఘునాథపల్లి /లింగాలఘణపురం: అన్నదాతలు రైతుబీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని, ఈ నెల 13వ తేదీవరకు మాత్రమే చివరి గడువు ఉందని రఘునాథపల్లి మండల వ్యవసాయాధికారి కాకి శ్రీనివాస్‌రెడ్డి, లింగాల ఘణపురం ఏఓ శ్రీనివాసురెడ్డి తెలిపారు. సోమవారం వారు వేర్వేరుగా మాట్లాడుతూ.. 2025, జూన్ 5వ తేదీ నాటికి భూభారతి పోర్టల్‌లో డిజిటల్ సైన్ చేసిన పట్టాదారు పాస్‌బుక్ కలిగిన రైతులు మాత్రమే అర్హులన్నారు. 18–59 సంవత్సరాల లోపు ఉన్న రైతులు 13వ తేదీలోగా తమ దరఖాస్తులను సంబంధిత ఏఈఓలకు అందజేయాలని తెలిపారు. అలాగే రైతుబీమా ఉన్న రైతులు వారి వివరాల సవరణకు ఏఈఓలను సంప్రదించాలని ఆయన సూచించారు.

ఆర్థికసాయం



పాలకుర్తి : మండలంలోని విస్నూరు గ్రామానికి చెందిన కళ్ల గట్టయ్య ఇటీవల మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబానికి గ్రామస్తులు జమ చేసిన రూ.31,500ల నగదును సోమవారం అందజేశారు. బాలగాని మహేష్ చొరవతో సేకరించిన ఆర్థికసాయాన్ని గౌడ సంఘం అధ్యక్షుడు బాలగాని సత్తయ్య, స్థానిక నాయకులతో కలసి కుటుంబీకులకు అందజేశారు.

సన్మానం




స్టేషన్‌ఘన్‌పూర్ : తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్(టీఎస్‌ఈఈయూ–327) ట్రాన్స్‌కో విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శివునిపల్లికి చెందిన తోట అశోక్ ఇటీవల ఎన్నికయ్యాడు. కాగా శివునిపల్లి గణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం అశోక్‌ను ఘనంగా సన్మానించారు. యూత్ బాధ్యులు తోట రమేష్, గాండ్ల మహేందర్, తోట రాజు, రమేష్, రాజు, రఘు, దివ్యాకర్, మహేందర్, అఖిల్, రాజేష్, రాకేష్, సాంబరాజు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



పాలకుర్తి : మండలంలోని దుబ్బతండా(టి) గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు గుగులోత్ రవి తండ్రి సత్తయ్య సోమవారం మృతి చెందాడు. కాగా బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, తదితర నాయకులు సత్తయ్య మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. దుబ్బతండా అధ్యక్షుడు గుగులోత్ వాసునాయక్, మాజీ సర్పంచ్ గుగులోతు బాలు నాయక్, బీఆర్‌ఎస్ జనగామ జిల్లా అధ్యక్షుడు మహేందర్ నాయక్, తాడెం రవి, మాజీ సర్పంచ్ ఇమ్మడి ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

రవీందర్‌కు మాజీ మంత్రి ఎర్రబెల్లి..



పాలకుర్తి మండలంలోని ముత్తారం గ్రామానికి చెందిన చాకలి ఐలమ్మ వ్యవసాయ మార్కెట్ మాజీ డైరెక్టర్ కర్ర రవీందర్ నిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. ఆదివారం నిమ్స్‌లో బాధితుడిని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులతో మాట్లాడారు. బాధిత కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పారు.

కంప్యూటర్ల బహూకరణ



చిల్పూరు : మండలంలోని శ్రీపతిపల్లి గ్రామానికి చెందిన ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ విష్ణు, జాతీయ మానవ హక్కుల కమిటీ చైర్మన్ పొగాకుల విష్ణువర్ధన్ స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు కంప్యూటర్లను ఇటీవల అందజేశారు. కాగా సోమవారం ఎంఈఓ దాసరి గోవర్ధన్ వాటిని ప్రారంభించారు. ఈసందర్భంగా విష్ణు మాట్లాడుతూ.. ఎఫ్ఎల్ఎన్ ఎక్సల్ (ఏ1)లో భాగంగా పాఠశాలలో చదివే విద్యార్థులకు కంప్యూటర్‌పై అవగాహన ఉండాలనే తపనతో కంప్యూటర్లు బహూకరించినట్లు తెలిపారు. హెచ్‌ఎం పద్మజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అధ్వాన రోడ్లతో అరిగోస

మరమ్మతుకు నోచుకోని సాగరం రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు, వాహనదారులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



అధ్వానంగా ఉన్న సాగరం రోడ్డు



కంకర తేలి గుంతలుగా మారిన బీటీ రోడ్డు

జఫర్‌గఢ్ : ఎప్పుడో వేసిన బీటీ రోడ్డు పూర్తిగా ధ్వంసమై కంకర తేలి గుంతలుగా మారింది. ఈ రహదారిపై వెళ్లాలంటే ప్రయాణికులు, వాహనదారులు, స్థానికులు భయపడుతున్నారు. మండలంలోని సాగరం రోడ్డు పూర్తిగా అధ్వానంగా తయారైంది. 2000 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం జఫర్‌గఢ్ గ్రామ రెవెన్యూ శివారు క్రాస్ నుంచి సాగరం, వడ్డెరకాలనీ మీదుగా వర్ధన్నపేట మండలం బండౌతాపురం గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మించింది. తిడుగు గ్రామం నుంచి సాగరం వరకు మరో బీటీ రోడ్డును నిర్మించారు. ఆయా రహదారులపై నిత్యం అనేక మంది ప్రయాణికులు, వాహనదారులు వెళ్తుంటారు. కాగా జఫర్‌గఢ్ గ్రామ రెవెన్యూ శివారు క్రాస్ నుంచి సాగరం, వడ్డెర కాలనీ మీదుగా బండౌతాపురం వరకు సుమారు ఏడు కిలోమీటర్లు, తిడుగు నుంచి సాగరం వరకు మరో మూడు కిలోమీటర్లు దూరంలో ఉన్న బీటీ రోడ్డు ఏళ్లు గడుస్తున్న ఇప్పటి వరకు మరమ్మతులకు నోచుకోలేదు. రోడ్డు నిర్మించిన సమయంలోనే నాసిరకంగా పనులు చేపట్టడం వల్ల వేసిన కొద్దిరోజులకే రహదారి ధ్వంసమైంది. ఆ తర్వాత మరమ్మతుల విషయంలో ఎవరూ పట్టించుకోలేదు. దీంతో ప్రయాణికులతో పాటు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

నరకం అనుభవిస్తున్నారు..

గుంతల రోడ్డుపై అవస్థలు పడుతూ రైతులు తమ తమ వ్యవసాయ పొలాల వద్దకు రాత్రి, పగలు వెళ్తుంటారు. దీంతో ఈ రహదారిపై వెళ్లాలంటే నరకం చూస్తున్నారు. రాత్రి వేళ రోడ్డుపై ఎక్కడ ఏ గుంతలో పడి ఏ ప్రమాదం వస్తుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధ్వంసమైన రహదారులను వెంటనే మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు ఆయా గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులకు తెలియజేసినా ఎవరు అటు వైపు కన్నెత్తి చూడడంలేదు. తమ ఇబ్బందులను అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు, స్థానికులు వాపోతున్నారు. గుంతలమయంగా మారిన రహదారులను ఇప్పటికైనా బాగు చేయాలని వారు కోరుతున్నారు.

రోడ్లను బాగుచేయడం లేదు



రోడ్డు ధ్వంసమై ఏళ్లు గడుస్తున్న ఎవరు పట్టించుకోవడం లేదు. ఈ రోడ్డుపై వెళ్లాలంటే నరకం చూడాల్సి వస్తున్నది. రాత్రిపూట ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణం చేయాల్సి వస్తున్నది. ఇప్పటికైనా ఈ రోడ్డును బాగు చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలి.

– కైరిక మల్లయ్య, సాగరం

వెంటనే మరమ్మతు చేయాలి



సాగరం రోడ్డు పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారింది. క్రాస్ నుంచి సాగరం, వడ్డెర కాలనీ వరకు తిడుగు నుంచి సాగరం వరకు రోడ్డు పూర్తిగా అధ్వానంగా ఉంది. ధ్వంసమై గుంతలమయంగా మారిన రోడ్డుకు వెంటనే మరమ్మతు చేయాలి.

– మారంరెడ్డి శౌరెడ్డి, సాగరం

'నీరటిలకు న్యాయం చేయాలి'



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నీరటిలు

స్టేషన్‌ఘన్‌పూర్ : ఘన్‌పూర్ ఎస్సీ కాలనీకి చెందిన నీరటి వంశస్తులకు నిజాం కాలంలో ఇనాంగా ఇచ్చిన భూమిని కొందరు అక్రమంగా పట్టాలు చేసుకున్నారని, విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని వారు కోరారు. ఘన్‌పూర్ మాజీ సర్పంచ్ నీరటి ప్రభాకర్ ఆధ్వర్యంలో ఆర్‌డీఓ డీఎస్ వెంకన్నకు, తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వారు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. ఘన్‌పూర్‌లో నీరటిలకు సర్వే నంబర్లు 292, 293, 294, 292/ఏ, 293/ఏ, 294/ఏలో నిజాం సర్కార్ 18ఎకరాల 36 గుంటల భూమిని ఇనాం ద్వారా అందించారన్నారు. 1333, 1348, 1349 ఫస్లీలలో నిజాం నవాబుల కాలంలో ఇనాం కింద ఇచ్చిన భూమిని కొందరు అక్రమంగా పట్టాలు చేసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో నీరటి రవి, యాదగిరి, మధు, మేరీ, సునీత, లక్ష్మి, ప్రమీల, యోహాన్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆప్యాయతకు ప్రతీక రక్షాబంధన్

- కలెక్టర్ రిజ్వాన్ బాషా



జనగామ రూరల్ : ఆప్యాయతకు ప్రతీక రక్షాబంధన్ అని కలెక్టర్ రిజ్వాన్‌బాషా షేక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలసదన్ చిన్నారులు కలెక్టర్‌కు రాఖీలు కట్టి స్వీట్లు అందజేశారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి చౌడేశ్వరి, సిబ్బంది, బాలసదనం చిన్నారులు పాల్గొన్నారు.

సిద్ధేశ్వరాలయంలో పూజలు



సిద్ధేశ్వరాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

బచ్చన్నపేట : కొడవటూర్‌లోని స్వయంభు సిద్ధేశ్వరాలయంలో శ్రావణ మాస సోమవారం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. శివలింగానికి పుష్పాలంకరణ చేసి అర్చన, అభిషేకాలు చేశారు. ఈఓ వంశీ, పూజారి ఓం నమశివాయ, సిబ్బంది పాల్గొన్నారు.

మహాదేవస్వామి ఆలయంలో..

రఘునాథపల్లి : మండల కేంద్రంలోని మహదేవ స్వామి ఆలయంలో శ్రావణ సోమవారం సందర్భంగా భక్తులు పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కూరెళ్ల పెద్ద ఉపేందర్–రేణుక దంపతుల ఆధ్వర్యంలో అర్చకులు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో హరీష్–కవిత, చింతకింది కృష్ణమూర్తి–రాజేశ్వరి దంపతులతో పాటు లగిశెట్టి లింగయ్య, పోకల పోషనాథం, హరిప్రసాద్, మంజుల, శ్రీనివాస్, వేదకుమార్, వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో రిటైర్డ్ హెచ్‌ఎం మృతి



వరదారెడ్డి (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్ : శివునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రిటైర్డ్ హెచ్‌ఎం రేకుల వరదారెడ్డి (87) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందాడు. చిల్పూరు మండలం వంగాలపల్లి గ్రామానికి చెందిన వరదారెడ్డి శివునిపల్లి జెడ్పీఎస్ఎస్ హెచ్‌ఎంగా 13ఏళ్ల పాటు విధులు నిర్వహించారు. ఆయన మృతిపట్ల పలువురు విశ్రాంత హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు సంతాపం ప్రకటించారు.

విద్యార్థులు ఏకాగ్రతను పెంచుకోవాలి




మాట్లాడుతున్న బోదమయానంద మహరాజ్

జనగామ రూరల్ : ఏ రంగంలోనైనా రాణించాలంటే విద్యార్థులు ఏకాగ్రతను పెంచుకోవాలని హైదరాబాద్ రామకృష్ణ మఠం చైర్మన్ స్వామి బోదమయానంద మహరాజ్ సూచించారు. సోమవారం ఏకశిల పబ్లిక్ స్కూల్‌లో సోషల్ వాయిస్ ఆఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం–దేశ నిర్మాణం సదస్సును నిర్వహించారు. మంగళంపల్లి రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బోదమయానంద మహరాజ్ మాట్లాడారు. సేవాసమితి కో ఆర్డినేటర్ సూర్య ప్రకాశ్, ఫౌండేషన్ డైరెక్టర్ దేవిప్రసాద్, సభ్యులు తుంగ కౌశిక్, శ్రీకాంత్, ఏకశిల పబ్లిక్ స్కూల్ ప్రతినిధులు రామకృష్ణ, రమేష్, చంద్రమౌళి పాల్గొన్నారు.


'కేసీఆర్ పాలన దిక్సూచి'

నర్మెట : కేసీఆర్ పాలన దేశానికి దిక్సూచి అని సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు రామిని శివరాజ్ గుప్తా కొనియాడారు. ఎమ్మెల్యే కోటాలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు సూర్యబండ తండాలో పార్టీ శ్రేణులు, లబ్ధిదారులతో కలిసి సోమవారం ముగ్గు పోసి మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేయాలని కోరారు. మాజీ సర్పంచ్ భూక్య నీలాలాలు, నాయకులు కేలోత్ శంకర్ నాయక్, భూక్య హరిశ్చంద్రు, భూక్య జయరాం, మల్లి, కేలోత్ రమేశ్ పాల్గొన్నారు.


జఫర్‌గఢ్ : తిడుగు పాఠశాలలో..



స్టేషన్‌ఘన్‌పూర్‌లో..



కొడకండ్లలో..



నులిపురుగుల నివారణే ధ్యేయం

నులిపురుగుల నివారణే ధ్యేయంగా సిబ్బంది కృషి చేయాలని, చిన్నారులకు, విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు ఇవ్వాలని పలువురు వైద్యాధికారులు తెలిపారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పలు పాఠశాలలు, అంగన్‌వాడీల్లో సోమవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. నులిపురుగుల నివారణతో ఎదుగుదల ఉంటుందని, 1–19 ఏళ్ల వయస్సు వారికి తప్పని సరిగా మాత్రలు వేయాలని వారు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో సూపర్‌వైజర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



తరిగొప్పుల: కేజీబీవీలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న వైద్యసిబ్బంది, ఉపాధ్యాయులు



చిల్పూరులో..



దేవరుప్పల: చిన్నమడూరులో..



నర్మెట: మాన్సింగ్‌తండా పాఠశాలలో..



రఘునాథపల్లిలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శ్రీదేవి



నర్మెట: అంగన్‌వాడీ కేంద్రంలో..

ఎండకు ఎండుతూ.. వానలో తడుస్తూ..

'సాక్షి' సాయం.. సలీం చేయూత
- అనాథలను ఆస్పత్రిలో చేర్పించి ఔదార్యం



వానలో తడుస్తూ అచేతనంగా ఉన్న వెంకటేశ్

జనగామ : ఎవరూ లేని అనాథ.. వందల కిలోమీటర్ల నుంచి ఎలా వచ్చాడో తెలియదు కానీ.. జిల్లా ఆస్పత్రి సమీపంలోని రోడ్డుపై రెండ్రోజులుగా అచేతన స్థితిలో పడి ఉన్నాడు. అందరూ చూస్తున్నారే తప్ప.. అయ్యోపాపం అనిపించ లేదు. సోమవారం మధ్యాహ్నం కురిసిన వర్షంలో ఆ వ్యక్తిని 'సాక్షి' విలేకరి చూసి వెంటనే ముస్లిం యువకుడు సలీంకు చెప్పడంతో ఆయన వెంటనే సదరు వ్యక్తిని జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించాడు. బాధితుడి జేబులోని ఆధార్ కార్డులో నిజామాబాద్ జిల్లా కామారెడ్డి హరిజన వాడకు చెందిన నిమ్మల వెంకటేశ్‌గా గుర్తించి, అందులోని నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారు. బంధువులకు ఈ విషయాన్ని చెప్పడంతో వారు జనగామకు వస్తున్నట్లు చెప్పారు. సకాలంలో స్పందించిన 'సాక్షి'తో పాటు సలీంకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

మానవత్వం చాటుకున్న కలెక్టర్

జనగామ రైల్వేస్టేషన్ ఆవరణలో కూరగాయలు అమ్ముకుంటున్న అనాథ వృద్ధురాలు గాలమ్మ తీవ్ర జ్వరంతో కుప్పకూలి పోగా, అక్కడే ఉన్న సలీం స్పందించి అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించాడు. వెంటనే సాక్షికి సమాచారం అందించగా, ఇదే విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లారు. వెంటనే ఇన్‌చార్జ్ డీడబ్ల్యూఓ చౌడేశ్వరిని పురమాయించారు. అధికారులతో వారు ఆస్పత్రికి వెళ్లి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. గాలమ్మను కోమటిరెడ్డి సుశీలమ్మ అనాథాశ్రమంలో చేర్పించేందుకు అధికారులు ప్రయత్నం చేయగా, కూరగాయలు అమ్ముకుంటానని, అక్కడికి వెళ్లనని ఆమె వారితో చెప్పింది. దీంతో 'సాక్షి'తో పాటు సలీంను ప్రజలు అభినందనలు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

అక్రమ అరెస్టు సరికాదు: ఎమ్మెల్యే యశస్విని

పాలకుర్తి టౌన్ : ఈవీఎంల టాంపరింగ్‌పై బహిరంగంగా మాట్లాడి సాక్ష్యాలతో లేవనెత్తినందుకు రాహుల్ గాంధీ, ప్రియాకంగాంధీని అరెస్టు చేయడం సరికాదని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ఉన్న ప్రభుత్వమే ప్రతిపక్ష స్వరాన్ని అణచివేయడం తగదన్నారు.

బ్యాగుల అందజేత



కొడకండ్ల : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలకు చెందిన 50 మంది విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం బ్యాగులు అందజేశారు. మహ్మద్ ఆసీఫ్, కొండ్రాతి ఉపేందర్, గాజుల రాములు లయన్స్ క్లబ్ తరఫున బ్యాగులు పంపిణీ చేశారు. హెచ్‌ఎం దొర్నం ప్రభాకర్, నేతి కొండయ్య, యాకయ్య, కోటేశ్వర్, సతీష్, ఉపేందర్, ఉమేష్, వేణు, కవిత తదితరులు పాల్గొన్నారు.

టై, బెల్ట్, ఐడీ కార్డ్స్..



జఫర్‌గఢ్ : మండలంలోని తమ్మడపల్లి (ఐ) ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు పొట్టబత్తిని శ్రీనివాస్ సొంత ఖర్చులతో విద్యార్థులకు టై, బెల్టులు, ఐడీ కార్డ్స్‌లను సోమవారం పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు రామ్మోహన్, ఏపీసీ చైర్మన్ కవిత, ఉపాధ్యాయులు సురేష్‌కుమార్, శ్రీనివాస్, విద్యాసాగర్, శోభ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాదుస్తులు..

దేవరుప్పుల : మండలంలోని నీర్మాల హైస్కూల్‌లో విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ జనగామ అధ్యక్షుడు బండ దయాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం క్రీడా దుస్తులు అందజేశారు. అనంతరం మొక్కలు నాటి ఎడమ సత్తమ్మ, రామిరెడ్డి జ్ఞాపకార్థం గ్రామ పంచాయతీ వద్ద బెంచీలు ఏర్పాటు చేశారు. లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ డాక్టర్ ఆర్య, సుధాకర్ రెడ్డి, హరికిషన్ రెడ్డి, ప్రభాకర్, కృష్ణబజాజ్, ప్రమోద్ కుమార్, చంద్రగిరి శ్రీనివాస్, ఉప్పలయ్య, సంజీవరెడ్డి, కృష్ణారెడ్డి, స్థానికులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దాతల తోడ్పాటు అభినందనీయం

విద్యార్థుల అభ్యున్నతికి దాతల తోడ్పాటు అభినందనీయమని మండల విద్యాధికారి, హెచ్‌ఎం జి.కళావతి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని చిన్నమడూరు హైస్కూల్‌లో దాతలు ఈటూరి శ్రీనివాసరావు రూ.30 వేలు, టీచర్ మాలతీలత, లయన్స్ సుధాకర్ రెడ్డి తదితరుల సహకారంతో అందించిన మెటీరియల్‌తో ఐఐటీ ఫౌండేషన్ కోర్సును ప్రారంభించారు. ఈ విద్యా సంవత్సరం చివరిదాకా గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ సబ్జెక్టులతో కూడిన ఎంబైపీసీ ఐఐటీ ఫౌండేషన్ శిక్షణను విద్యార్థులకు అందించనున్నట్లు తెలిపారు. కోర్సు ఇన్‌చార్జ్ రజినీకాంత్, ఎస్ఎంసీ చైర్మన్ శోభ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చర్య తీసుకోవాలి

దేవరుప్పుల : మండలంలోని కోలుకొండ రెవెన్యూ పరిధి రామచంద్రాపురంలో బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో రెండేళ్ల కిందట ఈజీఎస్ నిధులతో మురికి కాల్వ నిర్మించారు. కాగా నాణ్యత ప్రమాణాల లోపంతో నిర్మించిన అధికార యంత్రాంగం, కాంట్రాక్టర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సోషల్ మీడియా వేదికగా గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

కయ్య చెరువు కాల్వను అక్రమించిన వారిపై..

చిల్పూరు : లింగంపల్లి గ్రామ సమీపంలోని కయ్య చెరువు కాల్వను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచ్ ఏదునూరి రవీందర్, సమ్మక్క–సారలమ్మ జాతర చైర్మన్ కండ్లకోలు బాలరాజు కోరారు. సోమవారం ఎస్సై సిరిపురం నవీన్ కుమార్, తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు గ్రామ రైతుల తరఫున వారు వినతి పత్రాలు అందజేశారు. కయ్య చెరువు నుంచి రైతుల పంటపొలాలకు సాగు నీరు వెళ్లే కాల్వను గ్రామానికి చెందిన మాటూరి శ్రీనివాస్ ఆక్రమించుకోవడంతో దారిలేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. విచారించి చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేయాలని కోరినట్లు వారు తెలిపారు.

వర్షంతో అన్నదాతల హర్షం

దేవరుప్పుల : సోమవారం రాత్రి ఎడతెరపిలేకుండా కురిసిన వర్షంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేశారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వాగు పరిసర ప్రాంతాల్లోని చెక్‌డ్యామ్‌లు నిండి ప్రవాహం మొదలైంది.

బ్రిడ్జిలు నిర్మించాలి

జనగామ రూరల్ : గానుగు పహాడ్, చీటకోడూరు, వడ్లకొండ బ్రిడ్జిలను వెంటనే నిర్మించాలని కేజీకేఎస్ జిల్లా కార్యదర్శి బాల్నె వెంకటమల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బ్రిడ్జి సాధన సమితి అధ్యక్షుడు యాసరపు కర్నాకర్ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు సోమవారం నాటికి 13వ రోజుకు చేరుకున్నాయి. ఈసందర్భంగా నిరాహార దీక్షకు సంపూర్ణ మద్దతు తెలిపి వెంకటమల్లయ్య మాట్లాడారు.

ఓటరు జాబితా పనుల్లో బిజీబిజీ

చిల్పూరు : రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు మండలంలోని గ్రామ పంచాయతీల వారిగా ఓటరు జాబితా మార్పులు, చేర్పుల పనుల్లో బీఎల్ఓలు నిమగ్నమయ్యారు. ఎంపీఓ మధుసూదనాచారి ఆధ్వర్యంలో సోమవారం చిన్నపెండ్యాల పంచాయతీ ఆవరణలో వార్డుల వారీగా జాబితా సిద్ధం చేసే పనులను కార్యదర్శులు చేపట్టారు. వాటిని వెంటనే కంప్యూటర్‌లో నమోదు చేశారు. కార్యదర్శులు తండ రాంబాబు, తౌటి శశిధర్‌రెడ్డి, పస్నీరు మధసూదన్, బానోత్ విమల, ఎన్నకూస రాజు, హరిప్రసాద్, బాపు నాయక్, చుక్క లింగయ్య తదితరులు ఉన్నారు.

వ్యక్తి అదృశ్యం



పరశురాములు

స్టేషన్‌ఘన్‌పూర్ : దేవరుప్పుల మండలం ధర్మపురం గ్రామానికి చెందిన బొంత పరశురాములు స్టేషన్‌ఘన్‌పూర్ బస్టాండ్‌లో తప్పిపోయాడని బాధిత కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. పరశురాములుకు మతిస్థిమితం బాగా లేదని, కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 7న జగిత్యాల నుంచి వస్తుండగా స్టేషన్‌ఘన్‌పూర్ బస్టాండ్ వద్ద మూత్ర విసర్జనకు బస్సు దిగి తిరిగి రాలేదని తెలిపారు. చుట్టు పక్కల వెతికినా ఆచూకి లేదన్నారు. తెలుపు చొక్కా, గ్రీన్ ప్యాంటు ధరించి ఉన్నాడని, 5.5 ఫీట్ల ఎత్తుతో నలుపు రంగులో ఉంటాడని తెలిపారు. ఆచూకి తెలిస్తే పోలీసులకు 8712685037 నంబర్‌లో సమాచారం అందించాలని ఎస్సై రాజేష్ కోరారు.

మీదికొండకు చెందిన వృద్ధుడు..



ఐలయ్య

మండలంలోని మీదికొండకు చెందిన వృద్ధుడు కావటి ఐలయ్య ఆచూకి లేదని కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈనెల 3న ఐలయ్య ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదని తెలిపారు. ఐలయ్య 5 ఫీట్లు ఎత్తుతో చామన చాయ రంగులో ఉంటాడని, ఇంటి నుంచి వెళ్లే సమయంలో తెలుపు చొక్కా, దోతి ధరించినట్లు తెలిపారు.

గుట్కా ప్యాకెట్ల స్వాధీనం

రఘునాథపల్లి : మండలంలోని గోవర్ధనగిరిలో ఎర్రం హరిప్రసాద్ అనే వ్యక్తి నిషేధిత గుట్కా, అంబర్ ప్యాకెట్లు విక్రయిస్తుండగా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై దూదిమెట్ల నరేష్ తెలిపారు. సోమవారం పెట్రోలింగ్ నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్ సాయికుమార్ గ్రామంలో హరిప్రసాద్ తన కిరాణా షాపులో నిల్వ చేసి విక్రయిస్తున్న గుట్కా, అంబర్ల ప్యాకెట్లును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఎస్సై మాట్లాడుతూ.. ఎవరైనా నిషేధిత గుట్కా, అంబర్లు విక్రయించినా, కొనుగోలు చేసినా చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.